గురుకుల కళాశాలలో బతుకమ్మ వేడుక



విశ్వంభర, ఎల్బీనగర్ : చైతన్యపురిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా న్యాయ కళాశాల లో బతుకమ్మ సంబరాలు ప్రిన్సిపాల్ డా. ఎం. మానస అధ్యక్షతన ఘనంగా బతుకమ్మ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మానస మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ పండుగ అని అన్నారు. తెలంగాణ అనగానే గుర్తొచ్చే మొదటి పండుగ బతుకమ్మ అని,పూలను పూజించే ఏకైక పండుగ ఇది అని అన్నారు.'బతుకమ్మ' అంటే బతుకునిచ్చే అమ్మ అని అర్థం. ఆడబిడ్డల ఆనందానికి, ప్రకృతి అందానికి ప్రతిరూపం ఈ పండుగ అని విద్యార్థులకు తెలియజేశారు. బతుకమ్మ పండుగను తొమ్మిది రోజుల పాటు ఘనంగా జరుపుకుంటారు. ప్రతి రోజుకు ఒక ప్రత్యేకత ఉంది. మొదటి రోజు ఎంగిలి పూల బతుకమ్మతో ప్రారంభమై, చివరి రోజు సద్దుల బతుకమ్మతో ముగుస్తుంది. చివరి రోజు అత్యంత వైభవంగా ఉంటుంది. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పి.కవిత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పట్టభద్రులు ఓటు హక్కును నమోదు చేసుకోవాలి

ఉపాధ్యక్షులు మొహమ్మద్ జాహేద్



విశ్వంభర, సరూర్ నగర్ : అభివృద్ధి జరగాలన్నా.. సంక్షేమ ఫలాలు అందాలన్నా అది కేవలం ఓటు అనే ఆయుధంతోనే సాధ్యమని ఆర్కేపురం డివిజన్ బిఆర్ఎస్ పార్టీ ఉపాధ్యక్షులు మొహమ్మద్ జాహేద్ పేర్కొన్నారు. శనివారము ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో త్వరలో మహబూబ్ నగర్ రంగారెడ్డి హైదరాబాద్, నల్లగొండ ఖమ్మం ,వరంగల్ పట్టభద్రుల నియోజక వర్గాలకు ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో అర్హులైన పట్టబద్రులు సెప్టెంబరు 28 నుంచి నవంబరు 6వ తేదీ లోపు తమ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని సూచించారు. మహబూబ్నగర్, రంగారెడ్డి హైదరాబాద్ నియోజకవర్గం పరిధిలోని పట్టబద్రులు ఓటర్ గా నమోదు చేయించుకోవడంతో పాటు ఓటును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆర్కే పురంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు



విశ్వంభర, ఎల్బీనగర్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ఆర్.కే పురంలో చిలుక మధుర ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు వివిధ రకాల రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి, సంప్రదాయ బతుకమ్మ పాటలు పాడుతూ ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ ఆటపాటలతో ప్రాంగణమంతా పండుగ శోభను సంతరించుకుంది. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ఐక్యతకు, ప్రకృతి ఆరాధనకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ వేడుకల ద్వారా మహిళల్లో ఐక్యతను పెంపొందించడంతో పాటు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని చాటిచెప్పడం ఆనందంగా ఉందని తెలిపారు.

ఓం శక్తి నగర్ కాలనీలో..



విశ్వంభర, ఇబ్రహీంపట్నం : రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ఓం శక్తి నగర్ కాలనీలో ఎంగిలిపువ్వు బతుకమ్మ సంబరాలు అత్యంత ఘనంగా, ఉత్సాహంగా జరిగాయి. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ పండుగలో భాగంగా మొదటగా జరుపుకునే ఎంగిలిపువ్వు బతుకమ్మ వేడుకలను కాలనీలోని కమ్యూనిటీ హాల్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చారు.ఈ కార్యక్రమానికి 12వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆకుల మమత పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో కాలనీ పెద్దలు, యువత, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





ఎంగిలిపూల బతుకమ్మ సందర్భంగా చంపాపేట్ డివిజన్ పరిధిలోని మాధవ్ నగర్ కాలనీ నందు బతుకమ్మలతో మహిళలు ,చిన్నారులు.

(విశ్వంభర, చంపాపేట్)



రంగురంగుల పూలతో బతుకమ్మను అలంకరించి అలంకరణ చేసి బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆర్కేపురం డివిజన్ లక్ష్మీనగర్ కాలనీలోని లెజెండ్ గెలాక్సీ అపార్ట్మెంట్లో ఎంగిలి బతుకమ్మ వేడుకలు సాంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు ఆటపాటల మధ్య వైభవంగా నిర్వహించారు. (విశ్వంభర,సరూర్నగర్)



చండూర్ మండల కేంద్రంలో బతుకమ్మ వేడుకల్లో మహిళలు



బతుకమ్మలతో చిన్నారులు



వాసవి భవన్ చైతన్యపురిలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న ఆడక బాడీ చైర్మన్ పాలడుగు రాములు, గజ్జల నవీన్ కుమార్, గజవాడ సత్యనారాయణ, పోలేకంపల్లి శంకర్ రావు తదితరులు.

బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక





విశ్వంభర, సరూర్ నగర్ : బతుకమ్మ పండగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకా అని తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్త అన్నారు. శనివారం ఆర్కే పురం డివిజన్ వాసవి కాలనీ అష్టలక్ష్మి దేవాలయ గ్రౌండ్ ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం వి 3 ఛానల్, విశ్వంభర దినపత్రిక డైరెక్టర్ కాచం సుష్మ స్పాన్సర్ చేసిన మొదట బతుకమ్మలను తీసుకొచ్చిన 50 మందికి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కాల్వ సుజాత గుప్తా మాట్లాడుతూ బతుకమ్మ అంటే బతుకునిచ్చే అమ్మ అని అర్థం. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే పండుగ బతుకమ్మ. ప్రకృతిని, పూలను పూజించే ఏకైక పండుగ ఇది అని అన్నారు. తెలంగాణ సంస్కృతి విలువలను ప్రపంచానికి చాటే పండుగ అని అన్నారు. సజ్జల బతుకమ్మ వేడుకలకు మంత్రి సీతక్కను తప్పకుండా హాజరయ్యేలా చూస్తారని హామీ ఇచ్చారు.











దివ్యాంగ పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు

బ్యాంక్ ఆఫ్ బరోడా చేయూత

- ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సదస్సు
- రూ. 7.61 లక్షల థెరపీ, బోధనా పరికరాల అందజేత



విశ్వంభర, కొత్తపేట : మానస చిన్నారుల ఆరోగ్య వైకల్యాల అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని "మానసిక వికాసం ద్వారా జీవితాలకు సాధికారత: మేధోపరమైన వైకల్యాలు కలిగిన పిల్లల మానసిక ఆరోగ్యం, శ్రేయస్సు" అనే అంశంపై సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రసంగించిన డాక్టర్ అనిత రాయిరాల, సైకియాట్రీ విభాగాధిపతి ,ప్రొఫెసర్, ప్రభుత్వ వైద్య కళాశాల, సిద్ధిపేట, హైదరాబాద్ ఎర్రగడ్డలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌కు గతంలో ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా పనిచేసిన వారు, మేధోపరమైన వైకల్యాలు కలిగిన పిల్లలు సమ్మిళిత విద్యను పొందడంలో ఎదుర్కొంటున్న సవాళ్లను వివరించారు. పిల్లల పట్ల సమాజంలో మరింత అవగాహన, అంగీకార భావన పెంపొందించాలని, వారిని అర్థవంతమైన కార్యకలాపాల్లో నిమగ్నం చేయాలని, అందరికీ సమాన అవకాశాలు కల్పించే సహాయక వాతావరణాన్ని సృష్టించాలని ఆమె సూచించారు. మానసిక ఆరోగ్య సమస్యలను నివారించేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని కూడా ఆమె నొక్కిచెప్పారు. పిల్లలకు సమర్థవంతమైన చికిత్సా సేవలు అందించేందుకు థెరపీ నిపుణులు తమ పరిజ్ఞానాన్ని, నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరుచుకోవాలని ఆమె ప్రోత్సహించారు.బ్యాంక్ ఆఫ్ బరోడా తెలంగాణ నార్త్ రీజియన్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ , డిప్యూటీ రీజినల్ హెడ్ అభిషేక్ భారతి, మానస అందిస్తున్న సేవలను అభినందించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలిగించాలి

- ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



విశ్వంభర, ఎల్బీనగర్ : ప్రజాస్వామ్య వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. ఓటర్ల జాబితాలో అక్రమాలు జరిగాయనే ఆరోపణలపై ఎన్నికల సంఘం సమగ్ర వివరణ ఇవ్వాలని, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఆధ్వర్యంలో ఎల్బీనగర్ చౌరస్తాలో నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన ఎమర్జెన్సీకి, ప్రస్తుతం బీజేపీ పాలనలో నెలకొన్నాయని తాముఆరోపిస్తున్న అప్రకటిత ఎమర్జెన్సీ పరిస్థితులకు మధ్య పోలికలు ఉన్నాయని సుధీర్ రెడ్డి అన్నారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పూర్తి పారదర్శకత, నిష్పక్షపాత వైఖరి, జవాబుదారీతనం పాటించాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్యానికి గుండెకాయ వంటి భావవ్యక్తీకరణ స్వేచ్ఛను అణచివేస్తూ, ప్రశ్నించే గొంతులను నిరోధిస్తూ, శాంతియుతంగా నిరసన తెలిపే యువతను నిర్మూ చే చర్యలను బీఆర్ఎస్ తీవ్రంగా ఖండిస్తోందని తెలిపారు. అరెస్టు చేసిన విద్యార్థులు తమ తమ రాష్ట్రాలకు క్షేమంగా చేరేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిపక్షాలను,ప్రశ్నించే వారిని ఫేక్ మీడియా ద్వారా దేశద్రోహులు,పాకిస్తాన్ లేదా చైనా గూఢచారులు, జార్జ్ సోరోస్‌కు చెందిన వ్యక్తులంటూ ముద్ర వేసే ప్రయత్నాలు చేయవద్దని సుధీర్ రెడ్డి హితవు పలికారు. ఈ ధర్నాలో మాజీ కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు, మహిళలు, పార్టీ కార్యకర్తలు పాల్గొని ఓటు హక్కు పరిరక్షణకు తమ సంఘీభావాన్నిప్రకటించారు.

అమావాస్య అన్నదానం



విశ్వంభర, సరూర్ నగర్ : సరూర్ నగర్ లోని బంగారు మైసమ్మ కాశీ వైద్యనాథ దేవస్థానంలో ప్రతి అమావాస్య రోజు గోల్డెన్ వాకర్స్ టీం (ఆర్యవైశ్య గ్రూప్) వారి ఆధ్వర్యంలో జరిగే అమావాస్య ప్రత్యేక భోజనాలను దేవాలయంలో ప్రత్యేకంగా వడ్డించారు.. ఈ సందర్భంగా సరూర్నగర్ కొత్తపేట చౌరస్తా గోల్డెన్ వాకర్స్ టీం అధ్యక్షులు ఉప్పల కృష్ణ(ఎన్టీఆర్)గుప్తా, కాసెట్టి నాగేష్ గుప్తా, చోలేటి ఆనంద్ గుప్తాల లు మాట్లాడుతూ బంగారం మైసమ్మ దేవాలయములో ఐదు సంవత్సరములుగా ప్రతిరోజు 200 మందికి నిత్యాన్నదాన పథకాన్ని దిగ్విజయంగా నడిపిస్తున్న దేవాలయం ఫౌండర్ ట్రస్టీలు బేర బాలకిషన్ (బాలన్న).. ఆకుల అరవింద్ కుమార్ లు చేస్తున్న సేవా చాలా గొప్పదని. సరూర్నగర్ ప్రాంతంలో అనతి కాలంలోనే బంగారు మైసమ్మ దేవాలయంను అనేక విధాలుగా అభివృద్ధి చేసినారని కొనియాడారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఉప్పల (ఎన్టీఆర్)కృష్ణ గుప్త జన్మదిన సందర్భంగా బంగారం మైసమ్మ దేవాలయం కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

కొంపల్లిలో అమావాస్య అన్నదానం

విశ్వంభర, కొంపల్లి : కొంపల్లిలోనీ వాసవీ సేవాదళ్ సుచిత్ర ఆధ్వర్యంలో మహాలయ అమావాస్య సందర్భంగా జెడిమెట్ల చౌరస్తా గాంధీ విగ్రహము దగ్గర ఉన్న మూడు గుళ్ల వద్ద మహా అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరిగినది. దాదాపుగా 700 మందికి భోజనం వితరణ చేయడము జరిగినది. కార్యక్రమంలో పడకంటి వెంకటేశం, తోట బిక్షపతి, పళ్ళ నాగరాజు, మాశెట్టి శివకుమార్, రఘునాథ్, ఎల్లయ్య, వీరేషం, లక్ష్మణ్, శ్రీనివాస్, రాము, ప్రవీణ్ కుమార, రాజలింగం, గిరిధర్, నవీన్ తదితరులు 40 మంది సేవాదళ్ సభ్యులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



జూబ్లీహిల్స్ లో ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ



విశ్వంభర,జూబ్లీహిల్స్ : బతుకమ్మ, దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఎంగిలి బతుకమ్మ సంబరాలు కృష్ణకాంత్ పార్క్ జూబ్లీహిల్స్ లో టిఆర్ఎస్ ఇన్చార్జ్ హలిమా బేగం ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. హాలిమాబేగం మాట్లాడుతూ మైనార్టీ కి పెద్ద పీట వేయడం చాలా సంతోషంగా ఉందని,తెరాస పార్టీ అన్ని మతాలను గౌరవించడానికి ఇది ఒక నిదర్శనమని అన్ని మతాల సమూహంతో నాపై ఉంచిన బాధ్యతను నెరవేర్చడానికి సాయ శక్తుల కృషి చేస్తానని బతుకమ్మ సంబరాలను నిర్విఘ్నంగా కొనసాగిస్తామని ఆమె తెలిపారు. టిఆర్ఎస్ పార్టీ స్టేట్ న్యాయ విభాగం ప్రెసిడెంట్ సరేందర్ యాదవ్, టిఆర్ఎస్ పార్టీ స్టేట్ వింగ్ ప్రెసిడెంట్ పడాల మనోజ గౌడ్, జాగృతి స్టేట్ ప్రెసిడెంట్ మాధవి, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ లీడర్ లతారావు, లతా,మమత, ఎర్రగడ్డ మౌనిక, ముల్తాన్కర్ నరేష్, భారతి, గీతాగౌడ్, పరాబెగం,నూర్జహా, ప్రమీల, పల్లవి,దీన,సరిత, శ్యామల, శ్రావణి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

గోల్డెన్ లీవ్స్ విల్లాస్ లో బతుకమ్మ పండుగ సంబరాలు



విశ్వంభర, నాగోల్ : నాగోల్ లోని గోల్డెన్ లీవ్స్ విల్లాస్ లో బతుకమ్మ పండుగ సంబరాలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతికి సాంప్రదాయాలకు ప్రతీక అయినా బతుకమ్మ పండుగలో భాగంగా మొదటిరోజు జరుపుకొనే ఎంగిలిపువ్వు బతుకమ్మను ప్రాంగణంలో నిర్వహించారు. మహిళలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోల్డెన్ లీవ్స్ విల్లాస్ చైర్మన్ కే. ఆనంద్ రెడ్డి, సెక్రటరీ నన్నూరు సీతారాంరెడ్డి , పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న సర్పంచ్ విజయ్ కుమార్



విశ్వంభర, మహబూబాబాద్ : నడివాడ గ్రామపంచాయతీ పరిధిలోని రంగసాయిపేట గ్రామంలో ఘనంగా సర్పంచి మైదం విజయ్ కుమార్ , ఉప సర్పంచ్ భావన, గ్రామ పెద్దల ఆధ్వర్యంలో మహిళలు రకరకాల పూలు పేర్చి బతుకమ్మ సంబరాలు జరిపారు. ఈ సంబరాల్లో గ్రామస్తులు, మహిళలు, పెద్దలు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు .

బతుకమ్మ వేడుకల్లో దేప సురేఖ భాస్కర్ రెడ్డి



విశ్వంభర, ఎల్బీనగర్ : మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ అల్కాపురి కాలనీలో అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో మహేశ్వరం నియోజకవర్గం రామకృష్ణాపురం డివిజన్ జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ దేప సురేఖ భాస్కర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో అల్కాపురి కాలనీ మహిళా మండలి వారు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

రిపోర్టర్లు కావలెను

V3 NEWS ప్రజా విశ్వంభర "విశ్వంభర" తెలుగు దిన పత్రిక

ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.

సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి × రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060. తెలంగాణ.

సెల్: 9441222429, 8885402108